# బదిలీ

రామారావు తన మిత్రులందరికీ చెప్పుకున్నాడు...

"ఏమనుకుంటున్నారో - ఏమో! ఈ రామా



రావుని ఇకమీదట యింతయిదిగా కలవలేరు. మాట్లాడాలంటే ఫోన్ చేయవలసి వస్తుంది. లేదా రెండొందలు ఖర్చుపెట్టుకుని రావాల్సి వస్తుంది".

"అదేం? ఎదురుగా ఉన్న మనిషికి ఫోన్ ఎందుకు చేయాలి?" శివరావు సందేహం...

"అది కాదోయ్! మనం ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోతున్నాం!" గర్వంగా చెప్పాడు.

"ఆపవయ్యా! నీ బోడిజోకులు – అరవై అయిదు సంవత్సరాలు నీకు – రిటైరై ఏడు సంవత్సరాలయింది. ఈ వయసులో నీకు ట్రాన్స్‌ఫర్ ఒకే చోటికి వస్తుంది – అంతే!" మిత్రుడు కోటేశ్వరరావు వెటకారంగా అన్నాడు.

"లేదు – ట్రాన్స్‌ఫర్ అంటే నాకని కాదు – నా కొడుక్కి. వాడితోపాటు నేను కూడా – ఒంటి లింగం శొంఠికొమ్ములాగా మేమిక్కడుండి ఏం చేయాలి?" రామారావు వివరించాడు.

"ఓర్నీ! అబ్బాయికి బదిలీ అయిందన్నమాట! అవునులే... నీకు ఏకైక సంతానంకదా వాసు – వాడితో పోతావన్నమాట" నిరాశగా చెప్పాడు శివరావు.

"అవును మరి... ఈ వృద్ధాప్యంలో వీళ్ళిద్దరూ ఇక్కడుంటే రేపేదన్నా అవసరం వస్తే చూసే వాళ్ళు ఎవరు? కొత్త కోడలు బాగుందా?" అడిగాడు కోటేశ్వరరావు.

"అదృష్టమంటే నీదేనోయ్! శ్రీరాముడు లాంటి కొడుకు – సీతమ్మ వంటి కోడలు దొరికింది" శివరావు మెచ్చుకున్నాడు.

"మరి కోడలు కాలుపెట్టిన వేళావిశేషం – వాసుకు ప్రమోషను, ట్రాన్స్‌ఫర్ ఆరు నెలలు తిరగకుండానే వచ్చేశాయి. అయినా నాకీఊరంటే బోరు కొట్టేసిందోయ్! హైదరాబాద్ అయితే రోజుకో చోటుకు పోవచ్చు కాలక్షేపానికి" చెప్పాడు రామారావు.

"ఇంతకీ ఎప్పుడు వెళ్ళాలి?" అడిగాడు శివరావు.

"అబ్బాయి హైదరాబాద్ వెళ్ళాడు – అక్కడ జాయినై ఇల్లు అద్దెకు తీసుకుని వస్తానని. ఈలోగా కోడలు పుట్టింటి నుంచి వస్తుంది. అప్పుడు అందరం వెళ్ళిపోతాం – మహా అయితే ఓ పదిపదిహేనురోజులు ఇక్కడ ఉంటాం–" చెప్పాడు రామారావు.

"ఒరే మమ్మల్ని మర్చిపోమాకు. రాజధాని కదా ఏవన్నా పనులు పడితే మేము వస్తూ ఉంటాం – మీ ఇంట్లో దిగొచ్చుగా!" కోటేశ్వరరావు అడిగాడు.

"తప్పకుండా! అంతకంటే ఇంకేం కావాలి?" మనస్ఫూర్తిగా చెప్పాడు.

అది ఒక పార్కు. సాయంత్రం అయ్యేసరికి వృద్ధులంతా అక్కడికి చేరతారు. అలా రామారావుకు అక్కడ పెద్ద సర్కిలే ఉంది. అతన్ని అందరూ ఈర్ష్యతో చూస్తున్నారు.

శాంతమ్మ కూడా ఇరుగుపొరుగుకు చెప్పేసింది.

"పిన్నిగారూ... మీకు సిటీలో ఏదైనా అవసరం వస్తే రండి... మేముంటాం. మా వాడు ఏమీ అనుకోడు".

"ఈ వాతావరణం నాకు బోరు కొట్టేసింది. కూపస్థమండూకంలాగా ఎన్నాళ్లుంటాం? – అది సిటీ... వెరైటీగా ఉంటుంది..."

**వియోగి**

"అసలు మా వారికి హైదరాబాద్ అయితే బాగుండేదని నేను ఎప్పుడూ అనుకుంటూ ఉండేదాన్ని. కానీ ఆయనకు ఆ అవకాశం రాలేదు. ఆ ఊరి గాలి పీల్చకుండానే పోతానేమోనని బెంగపడ్డాను. ఇప్పుడు మా చంటి వెధవకి ట్రాన్స్‌ఫర్ వచ్చి మా కోరిక తీరబోతున్నది".

"మీ కోడలు బంగారం! గొడ్డొచ్చిన వేళ - పిల్లొచ్చిన వేళ అంటారు - మీకు బాగా అచ్చొచ్చింది. పిన్నిగారూ! - మా కోడలు అందరి కోడళ్ళలాంటిది కాదు. వినయం, విధేయత - పెద్దా చిన్న తారతమ్యం బాగా తెలుసు".

"మా కుర్ర సన్నాసి నేను గీసిన గీటు దాటడు. ఇంక వాడి పెళ్ళామా - వాడు ఎంత చెబితే అంతే!"

ఇలా శాంతమ్మ కబుర్లు దొర్లుతూ ఉండేవి పక్కింటి పిన్నిగారితో - ఎదురింటి వెంకాయమ్మతో - దాపునున్న లీలావతమ్మతో... ఇంకా కనకమహాలక్ష్మమ్మతో... సుబ్బాయమ్మతో...

ఎదురుచూసిన రోజు రానే వచ్చింది.

కొడుకు హైదరాబాద్ నుంచి వచ్చాడు. అదేం చిత్రమో... అతను వచ్చిన గంటకే కోడలు కూడా పుట్టింటి నుంచి వచ్చింది. అతని పేరు వాసు. ఆమె పేరు రాధ. ఈడూ జోడు కూడా! కొత్త దంపతులు.

"ఏరా వాసూ! అంతా బాగా జరిగిందా?" రామారావు అడిగాడు.

"అయ్యో! ఎంత చిక్కిపోయావురా!" తల్లి మనసు.

"మామయ్యగారూ మీకు కులాసానా? అత్తయ్యగారూ మీ ఒంట్లో నెమ్మదిగా ఉందా!" రాధ పలకరింపు.

నలుగురూ కూర్చుని భోజనం చేస్తున్నారు డైనింగ్ టేబుల్ దగ్గర.

"ఇంతకీ - వాసూ! హైదరాబాద్‌లో ఇల్లు పెద్దదేనా?" రామారావు అడిగాడు.

"చిన్నదేనండి నాన్నగారూ" చెప్పాడు

"అదేంట్రా - కాస్త పెద్దదే తీసుకోమన్నాంగా - మనదంటే స్వంత ఇల్లు అనుకో - ఇంతది కాకపోయినా కాస్త వసతి ఉండేటట్లు తీసుకున్నావా?" శాంతమ్మ అడిగింది ఆదుర్దాగా.

"లేదమ్మా! అది సిటీ కదా! ఇళ్ళు దొరకడం చాలా కష్టం - అబ్బో రెంట్లు ఆకాశాన్ని అంటుతున్నాయి" చెప్పాడు వాసు.

"ఇంతకీ ఇల్లు దొరికిందాండీ" రాధ గునుస్తూ అడిగింది.

"ఆ!... ఏవో రెండు గదులు - ఒక వరండా. సర్దుకుపోవాలి!" చెప్పాడు.

"అద్దె ఎంత?" అడిగాడు రామారావు.

"పదిహేనువందలు"


"అబ్బో! ఎక్కువే - అంతచిన్న ఇంట్లో ఉండాలన్న మాట మనం!" శాంతమ్మ దీర్ఘం తీసింది.

"ఇక్కడి ఊరుతో పోలిస్తే ఎలా? - అక్కడి వాతావరణం - అక్కడి మనుష్యులు - కలకత్తాలో అయితే రూము కూడా దొరకదుట" రామారావు చెప్పాడు - చెయ్యి కడుక్కుంటూ.

"ఇంతకీ ఎప్పుడు వెళ్ళాలిరా?" అడిగింది శాంతమ్మ.

"ఏముందమ్మా... ఓ రెండురోజుల్లో వెళ్ళా

మన గుండె రోజుకి 1,00,000 సార్లు కొట్టుకుంటుంది.




లి. తర్వాత మంచిరోజులు లేవు - అక్కడ ఇల్లు సర్దుకోవాలి!" అన్నాడు వాసు.

"సరే! రేపటి నుంచే ప్యాకింగ్ చేద్దాం..." చెప్పింది శాంతమ్మ.

"అద్దెకొస్తామంటూ తెగ తిరిగిపోతున్నారు - మన ఇల్లు అసలే సెంటర్‌లో ఉంది కదా- అద్దెకు మంచి డిమాండ్ - రెండు వేలు చెప్పా!" రామారావు చెప్పాడు.

"ఏంటీ ఒక పోర్షన్‌కి రెండు వేలా?" వాసు ఆశ్చర్యపోయాడు.

"అబ్బే! ఇది కుగ్రామం కదా! రెండు పోర్షన్లకూ కలిపి!" రామారావు.

"అయ్యో! రెండూ ఇచ్చేస్తే మీరెక్కడ ఉంటారు?" రామారావుని ఆశ్చర్యంగా అడిగాడు వాసు.

"భలేవాడివే! నీతోనే మేమూ - నువ్వు అక్కడ ఉంటే ఇక్కడ మేమెలా ఉంటాం? - నిన్ను విడిచి ఆయన ఒక్కరోజు కూడా ఉండలేరు" శాంతమ్మ చెప్పింది చురుగ్గా.

"ఆ! వస్తే బాగానే ఉంటుంది కానీ - ఇల్లు చిన్నది. నాన్నగారికి వసతిగా ఉండదు. సిటీ రష్‌లో ఎలా నెగ్గుకొస్తారు?. బస్సులు ఎక్కడం, దిగడం కష్టం. ఇంత ధారాళంగా గాలీ వెలుతురూ ఉండవు. నీరు కూడా ఇంత హాయిగా ఖర్చు పెట్టుకోలేం. రేషన్‌లాగా వాడుకోవాలి!" నసిగాడు వాసు.

"మాకంటే తప్పదు కదండీ! హాయిగా ఉన్న మిమ్మల్ని ఎందుకు ఇబ్బంది పెట్టాలి? మీరు ఇక్కడే ఉంటే - మీకు హాయిగా ఉంటుంది. మేమూ అడపాదడపా వచ్చిపోతుంటాము" వినయంగా చెప్పింది రాధ.

శాంతమ్మ నెత్తిన పిడుగుపడ్డట్టయింది.

రామారావు షాక్ తిన్నాడు.

"మీకిబ్బంది లేకపోతే నాకేం యిబ్బంది ఉం

డదు" రామారావు చెప్పాడు.

వాసు దీర్ఘాలోచనలో పడ్డాడు. చెయ్యి కడుక్కుని గదిలోకి వెళ్ళాడు. ఓ రెండు నిమిషాలాగి రాధ కూడా గదిలోకి వెళ్ళి తలుపేసుకుంది.

శాంతమ్మ వంటిల్లు కడిగి – సర్ది వచ్చింది... రామారావు పడుకున్న మంచం దగ్గరికి. ఆయన ఎటో చూస్తున్నాడు.

"ఏమండీ! ఇది వీడికి పుట్టిన బుద్ధేనా? మనల్ని వద్దంటాడేమిటి?"

"అదే నాకూ అర్ధం కావడం లేదు. వాడికి ట్రాన్స్‌ఫర్ వచ్చినప్పుడు కూడా అలా అనలేదు – మీరేం దిగులు పడకండి నాన్నగారూ – మంచి ఇల్లు తీసుకుని మిమ్మల్ని తీసుకుపోతాను అన్నాడు గదా!" అయోమయంగా అన్నాడు.

"ఏమండీ! వాడ్ని చూడందే నేను బ్రతకలేనండీ!" శాంతమ్మ ఏడ్చింది.

"పిచ్చిదానా! నేను మటుకు ఉండగలనా? మనకున్న ఒకే ఒక నలుసు వాడే కదా! కోడలు కడుపున ఓ కాయకాస్తే – వాడితో ఆడుకుంటూ ఈ జీవితం లాగించేద్దామనుకుంటున్నాంగదా! వాడి బాధ పెద్ద ఇల్లు దొరకలేదనేమో!" రామారావు చెప్పాడు.

"అంతేనంటారా?" శాంతమ్మ ఆశగా అంది.

"అంతేనే! వాడి మనసు మనకు తెలియదా. ఒక్క రోజు మనల్ని చూడందే వాడికి పిచ్చెక్కిపోదూ. మనల్ని వదిలి వెళ్ళాల్సి వస్తుందనేకదా డిపార్ట్‌మెంట్‌లో చాలా క్యాంపులు కూడా వెళ్ళంది" రామారావు ధైర్యం నూరిపోసాడు.

"చిన్నప్పటి నుంచీ కంటికి రెప్పలా పెంచాను. మనం తిన్నా తినకపోయినా వాడికేం లోటు జరుగకూడదని ఎంత కష్టపడ్డాం?. మంచి కోడలు రావాలని ఎన్ని సంబంధాలు వెతికాం? అటు ఏడు తరాలు – ఇటు ఏడు తరాలూ చూసి చేసుకున్నాం" కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

రామారావు ఓదార్చాడు.

తెల్లారింది – వాసు – రాధ సర్దే కార్యక్రమం మొదలు పెట్టారు. శాంతమ్మ కూడా సామాన్లు సర్దడం మొదలుపెట్టింది – తమ ట్రంకు పెట్టెలు – జాడీలు అన్నీ సర్దసాగింది.

"అమ్మా! అవన్నీ ఇప్పుడెందుకమ్మా?" చికాగ్గా అడిగాడు వాసు.

"అదేంటి? అన్నీ ఇక్కడ వదివేసిపోతామా? అద్దెవాళ్ళు పాడుచేయరూ!" అందిశాంతమ్మ.


"అవున్రా వాసూ! ఈ సామాన్లన్నీ ఒక గదిలో వేసి ఉంచుదాం – మనకు కావాల్సినవి మటుకు తీసుకుపోదాం!" రామారావు చెప్పాడు.

"మీకెలా చెప్పాలో నాకర్థం కావడం లేదు. ఆ ఇల్లు చాలా చిన్నది. రెండు మంచాలు వేస్తే ఆ గదిలో నడవలేం. ఇన్ని సామాన్లు ఎలా పట్టుకుపోతాం?" అడిగాడు వాసు.

"అది కాదురా! ఉన్నంతలో సర్దుకుపోవాలి మరి! తప్పదుగా"

"అత్తయ్యగారూ! కాస్త పెద్దయిల్లు దొరికిన తర్వాత మిమ్మల్ని పిల్చుకుపోతాం – అప్పటి దాకా యిక్కడే ఉండండి" తియ్యగా చెప్పింది రాధ.

"అదికాదమ్మా రాధమ్మా! మా వాడు మమ్మల్ని వదిలి ఒక్కరోజు కూడా ఉండలేడు. పైగా మేము కూడా వస్తే అందరం కలిసి పెద్ద ఇల్లు కోసం వెతకవచ్చు – వాడు ఆఫీసుకుపోయినా



మేమిద్దరం వెతుకుతాం!" అన్నాడు రామారావు.

"అయ్యో! మీ పిచ్చి మీకానందం - ఆయన కేమో నోట్లో నాలుకలేదు" రాధ సణుక్కుంది - బెడ్‌రూమ్‌లోకి దూరి తలుపేసుకుంది.

రామారావు, శాంతమ్మా వాసుని నిలదీసారు.

"అరే! వాసూ! మేము రావడం నీకిష్టమేనా?"

"అయ్యో! తల్లిదండ్రులు రావడం ఏ కొడుక్కి ఇష్టముండదు. కాకపోతే పరిస్థితులు అర్థం చేసుకోండి. ఆ ఇల్లు వసతిగా లేదు. రైలు పెట్టెల్లాగా వరుసగా ఉంటాయి మూడు గదులు. మాది కొత్త కాపురం - ప్రైవసీ కావాలి!" తలొంచుకుని చెప్పాడు.

"హు! అడ్డాలనాడు బిడ్డలు గానీ - గడ్డాలనాడు బిడ్డలా అని ఊరికే అన్నారా?" కోపంగా అంది శాంతమ్మ.

"వాసూ! మీ ప్రైవసీకొచ్చిన ఇబ్బందేం ఉండదు. ఇంకో ఇల్లు దొరికేదాకా మేము వరండాలో పడుకుంటాంలే!" దీనంగా అన్నాడు రామారావు.

తన భర్త అంత దీనంగా మాట్లాడ్డం శాంతమ్మ ఎప్పుడూ చూడలేదు అంతకుముందు.

"నే చెబుతున్నా కద నాన్నగారూ - ఇల్లు మంచిగా దొరకంగానే మిమ్మల్ని తీసుకుపోతాం - అప్పటిదాకా కాస్త ఓపిక పట్టండి..." వాసు బ్రతిమాలుతూ చెప్పాడు.

"ఛీ! వీడు నా కడుపున చెడబుట్టాడు - ఇది వీడికి పుట్టిన బుద్ధి కాదు. ఆ వగలమారిదే, ఎప్పుడూ తలుపులేసుకుంటూ ఉంటే ఇలాంటిదేదో అవుతుందని అప్పుడే అనుకున్నా!" శాంతమ్మ అంది.

"అదేం కాదమ్మా! అర్థం చేసుకో!" వాసు వారించాడు.

తలుపులు బోర్లా తెరుచుకుని రాధ ఉగ్ర రూపం దాల్చి వచ్చింది. "ఛీ! ఏం మనుషులం డీ మీరు - పెద్దవాళ్ళు పెద్ద బుద్ధులు కలిగి ఉండాలి. కొడుకు, కోడలూ సుఖపడితే ఓర్చు కోలేరు. ఒక వయసు వచ్చిం తర్వాత 'కృష్ణా రామా' అంటూ ఒక మూల పడుండాలిగానీ - తగుదునమ్మా అంటూ అన్నిట్లో వేలుపెడ తారు. ఇల్లు చిన్నదంటే అర్థం చేసుకోరేం? అంత ఉండలేని వాళ్ళు పెళ్ళెందుకు చేయాలి? అమ్మకూచిలా ఉంచి పెళ్ళీపెటాకులూ లేకుండా చూసుకోవాల్సింది" గబగబా దులిపేసి మళ్ళీ తలుపులు వేసుకుంది రాధ.


శాంతమ్మ నిశ్చేష్టురాలైపోయింది. ఆమె కళ్లవెంట బొటబొటా కన్నీళ్లు రాలాయి. రామా రావు కూడా స్టన్ అయినా ముందుగా తేరుకు న్నాడు. శాంతమ్మను తన గదిలోకి తీసుకెళ్లి మం చం మీద కూర్చోబెట్టాడు.

"సారీ! రాధకు ఆవేశం ఎక్కువ" వాసు చెప్పాడు చింతిస్తున్నట్లుగా.

"ఛీ! పెళ్ళాన్ని అదుపులో పెట్టుకోలేని వాడి వి నువ్వు ఒక మొగాడివా? నా కడుపున చెడబు ట్టావు!" శాంతమ్మ రోషంగా అంది.

"అది కాదమ్మా! రాధ గారాబంగా పెరిగిం ది. తన మాటకు ఎదురుచెబితే తట్టుకోలేదు. నా మొహం చూసి మా ఇద్దర్నీ క్షమించు" అని చెప్పి వాసు బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

రామారావు ఓదారుస్తూనే ఉన్నాడు శాంత



గురజాడ సాహిత్యంపై 17 మంది ప్రముఖుల విశ్లేషణా వ్యాసాల సంకలనం 'వెలుగుజాడ' ఆవిష్కరణ సభ అక్టోబర్ 7 న విజయనగరంలో జరిగింది. ఆకాశవాణి-విశాఖపట్నం కేంద్రం ద్వారా ప్రసారమైన ప్రసంగాలను శ్రీ నాగసూరి వేణుగోపాల్ సంపాదకత్వంలో గురజాడ విద్యా సంస్థలు ప్రచురించాయి. శ్రీ కాళీపట్నం రామారావు ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

మ్మని.

మూడయినా ఎవరూ భోజనానికి లేవలేదు. తానే శాంతమ్మను డైనింగ్ టేబుల్ దగ్గరకు తీసుకొచ్చాడు రామారావు. వాసు వచ్చాడు గానీ ఎంత బ్రతిమాలినా రాధ రాలేదు.

"అమ్మా రాధా! అలాగే కానీయమ్మా! పెద్ద ఇల్లు దొరికాక వస్తాంలే!" శాంతమ్మ చెప్పింది బాధగా.

అప్పుడొచ్చింది రాధ భోజనానికి. మొత్తానికి భోజనాలు కానిచ్చారు.

మరునాడు వాళ్ళు వెళ్ళిపోయారు సామాన్లతో. "బాబూ! వీలైనంత తొందరగా మమ్మల్ని తీసుకుపో – నిన్ను చూడందే మేం ఉండలేం" శాంతమ్మ చెప్పింది కన్నీళ్ళతో.

"నాకూ అంతే కదమ్మా!" వాసు చెప్పాడు.

"వాసూ! నా అంతటివాడివయ్యావు. నీకు మంచి ఏదో, చెడు ఏదో తెలుసు. నీకూ ఒక నలుసు పుడితే తెలుస్తుంది మా బాధ. నువ్వు పుట్టినప్పటి నుంచీ నిన్ను విడిచి ఉండలేదు. అర్థం చేసుకుని తొందరగా పెద్ద ఇల్లు తీసుకో – ఈ లోగా నెలకొకసారి అయినా వచ్చి వెళుతూ ఉండండి" రామారావు కన్నీరు ఆపుకుంటూ చెప్పాడు.

"అయ్యో! మాకు మటుకు ఉండదుటండీ! అలాగే వస్తాం" రాధ అతివినయంగా చెప్పి ఇద్దరి కాళ్ళకూ నమస్కరించి సెలవు తీసుకుంది.

వాళ్ళు వెళ్ళిపోతూంటే తన ప్రాణాలేపోయినట్లు బాధపడింది శాంతమ్మ.

చిన్నప్పుడు తెలియక గుండెలమీద తన్నాడు వాసు. ఇప్పుడు తెలిసితెలిసి తన్నిపోయినట్లు బాధపడ్డాడు రామారావు.

* * *

"వెధవ సిటీ! మనకి పడదు. అబ్బో! ఒకటే వాతావరణ కాలుష్యం. రోడ్ల మీద ప్రమాదాలు జాస్తి! ఆ బస్సుల్లో వేలాడుతూ పోవడం మన వల్లకాదు. అయినా అదేం రష్అండీ బాబూ! హాయిగా ఉన్న ప్రాణానికి లేనిపోని తిప్పలు కదూ!"

తన మిత్రబృందం దగ్గర వాపోయాడు రామారావు.

"పిన్నిగారూ! సిటీ సిటీ అంటే సంబరపడ్డా కానీ – పైన పటారం లోనలొటారంఅట! నీళ్ళకు క్యూలో నిలబడాలిట! బస్సుల కోసం గంటలు గంటలు కాచుకుని నిల్చోవాలిట! బస్సు వచ్చినా సీటు దొరకదుట. ఇంక పనిమనుషులంటారా? అస్సలు దొరకరు – దొరికినా వాళ్ళ జీతాలు మనం ఇవ్వలేం! బట్టలుతికే మనిషయితే ఉండనే ఉండదు. ఒళ్ళు వంచి అన్ని పనులూ మనమే చేసుకోవాలిట. ఇంతా ఏడిస్తే పీత బొక్కలాంటి యిండ్లుట! గాలీ వెలుతురూ రానే రావుట! పగలే లైట్లు వేసుకోవాలి – ఫ్యాన్ ఎప్పుడూ తిరుగుతూనే ఉండాలిట!"

"అంతేకాదండి – మీలాగా పలకరించే దిక్కులేదుట. మనకు అవసరం వచ్చినా ఎవరూ పట్టించుకోరుట – ఎవరి లైఫ్ వారిదట! హాయిగా పిన్నిగారూ అంటూ మీతో కబుర్లు చెబుతున్నానా! అక్కడ పలకరిద్దామన్నా ఎవరూ ఉండరుట! కాస్త టైముంటే అందరూ టీవీలకు అతుక్కుపోయి ఉంటారట".

"ఏమ్మా! మీ కొడుకూ కోడలూ రమ్మన లేదా!" అని ఎవరన్నా చుప్పనాతి వాళ్ళు అంటే శాంతమ్మ విరుచుకుపడుతుంది వాళ్ళమీద.

"అయ్యో! మేం రానిదే పోమని హఠం చేశారు. పిచ్చి సన్నాసి! వాడికి నేనంటే ఎంత ఇది - ఎంత అది - దానికి మాత్రం మేమంటే వల్లమాలిన ప్రేమ. శివపార్వతుల్లా మిమ్మల్ని పూజించుకుంటాం - మాకు అండగా ఉండమని కాళ్ళావేళ్ళా పడ్డారు. కానీ ఇంత విశాలమైన ఇళ్ళల్లో ఉండి, ఆ పిచ్చిక గూళ్ళల్లో బ్రతకలేమని మావారే వద్దన్నారు. మాకు తగ్గ పెద్దఇల్లు దొరికేదాకా రామని ఖండితంగా చెప్పేశారు".

వెళ్ళిన ఓ నెలకు కొడుకూ కోడలూ వచ్చి ఓ రెండు రోజులున్నారు. కొడుకు బాగా లావయ్యాడని రామారావు అనుకున్నాడు.

కోడలు లావయిందని శాంతమ్మ అనుకుంది.

"ఏరా! పెద్దయిల్లు తీసుకునే ప్రయత్నాలు ఎంతదాకా వచ్చాయి?"

"ఏదమ్మా! ఒక్కటీ సరిగా లేదు. ఇల్లు బావుంటే వాస్తు బావుండటం లేదు. అన్నీ బావుంటే సిటీకి పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉండాలి! అన్నీ బావున్నాయనుకుంటే అద్దె మూడువేలు పైగా పెట్టాలి. ఇంకేం పెట్టి తినాలి!" వాసు విచారంగా చెప్పాడు.

"అత్తయ్యగారూ బ్రోకరుకు కూడా చెప్పాం, ఒక్కటీ కుదరడం లేదు" రాధ చెప్పింది బాధ పడ్తున్నట్లుగా.

"ట్రాన్స్‌ఫర్ వచ్చింది వాసుకు హైదరాబాద్‌కుకాదే - తల్లి చేతిలోంచి పెళ్ళాం చేతిలోకి" బాధగా చెప్పాడు రామారావు.

కాలం చాలా వేగంగా దొర్లిపోతోంది సిటీలో.

కానీ నత్తనడక నడుస్తున్నది రామారావు దంపతులకు.

వారాలు - నెలలు గడిచాయి. ఇప్పుడు రెండు మూడు నెలలయినా వాళ్లు రావడం లేదు. అంతకుముందు ఫోన్లు చేసేవాడు - ఉత్తరాలు వ్రాసేవాడు. ఇప్పుడు అవీ తగ్గిపోయాయి. ఆఫీసులో చాలా బిజీగా ఉన్నానంటున్నాడు.

పెద్దిల్లు యింకా దొరకలేదు.

ఆశగా ఇద్దరూ ఎదురుచూస్తూనే ఉన్నారు.

ఆ ఉదయం కోటేశ్వరరావు రామారావు ఇంటికి వచ్చాడు.

"రామారావు... నిన్న పని ఉండి హైదరాబాద్ పోయానోయ్! దారిలో మీవాడు కనిపిస్తే యింటికి వెళ్ళాను. బాగున్నారయ్యా - అంతా బాగున్నారు. మీ వియ్యపురాలు - షడ్డకుడూ అంతా బాగున్నారు" చెప్పాడు కోటేశ్వరరావు.


"ఇల్లు బాగుందా?" ఆరాటంగా అడిగాడు రామారావు.

"ఆ! బాగానే ఉంది. సిటీలో ఆమాత్రం దొరకడం కష్టంలే!"

"వాళ్ళు ఎప్పుడొచ్చారుట అక్కడికి? ఎప్పుడు వెళతారట?" శాంతమ్మ ప్రశ్నించింది ఆరాగా...

"రావడమేమిటి? మీకు తెలియదా? అక్కడే ఉంటున్నారుట ఆరు నెలలుగా - మామగారికి ఒంట్లో బాగుండడం లేదుట - చెకప్‌కని అక్కడే ఉండిపోయారు - మాటమాటికీ ఎవరువస్తారులే అని. ఇంక వెళ్ళే ప్రశ్నలేనేలేదు. వీళ్ళకు తోడుగా వాళ్ళు - వాళ్ళకు తోడుగా వీళ్ళూ ఉన్నారు" చెప్పాడు కోటేశ్వర్రావు.

కాఫీ తాగి చక్కావెళ్ళిపోయాడు ఆయన. కాని రామారావు శాంతమ్మల మనసులు అ




శాంతితో నిండిపోయాయి.

వియ్యపురాలూ వాళ్ళు అక్కడున్న సంగతి తమకు చెప్పలేదని బాధపడ్డారు. రామారావు ఘాటుగా వాసుకు ఉత్తరం రాశాడు ఆఫీసు అడ్రసుకు.

"ప్రియమైన వాసుకి, ఉభయకుశలోపరి! మీ అత్తగారూ మామగారూ బాగున్నారా? అడిగినట్లు చెప్పు. మీ మామగారి ఆరోగ్యం ఎలా ఉంది? అంత చిన్న ఇంట్లో మీరంతా ఎలా ఉంటున్నారు? వాళ్ళ మూలంగా మీ ప్రైవసీకి యిబ్బంది కలగడం లేదా?

మాకిక్కడ చాలా బోర్ కొడుతున్నది - అనుక్షణం మీ యిద్దరూ గుర్తుకు వస్తున్నారు. కొంచెం పెద్ద యిల్లు తీసుకుంటే అందరం కలిసే ఉందాం. ప్రస్తుతానికి నా పెన్షన్ సరిపోతున్నది కనుక నీవు డబ్బు పంపకపోయినా ఏమీ అనుకోలేదు. కానీ వైద్య ఖర్చులు ఈమధ్య బాగా తగులుతున్నాయి. నీవు డబ్బు పంపకపోతే మాకు యిబ్బంది అవుతుంది. ఏది ఏమైనా మేము ఒంటరితనం భరించలేకుండా ఉన్నాం. దయుంచి మమ్మల్ని తీసుకుపో - ఆశీస్సులతో - నాన్న".

మూడు రోజుల్లో జవాబు వచ్చింది వాసు నుంచి.

"ప్రియమైన నాన్నగారికి, అమ్మకు,

నమస్కారాలు! ఇక్కడంతా క్షేమం. ఇది సిటీ. ఇక్కడ ఎంత డబ్బొచ్చినా సరిపోదు. క్రిందటి నెల పదివేలు మిమ్మల్ని అడుగుదామనుకుని మీ దగ్గర ఉండదేమోనని అప్పు చేసాను. ఒంటరితనాన్ని జయించండి. ఆధ్యాత్మిక పుస్తకాలు చదువుకోండి. మరీ బోర్ కొడితే మన ఊళ్ళో ఈ మధ్య ప్రారంభించబడిన వృద్ధాశ్రమంలో చేరమని నా సలహా. ఇట్లు మీ వాసు"

ఉత్తరం చూసి బొమ్మలైపోయారు రామారావు, శాంతమ్మలు.